# ఆదిత్య హృదయం

- డా॥ ఇలపావులూరి పాండురంగారావు



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# ఆదిత్య హృదయం

ఆదికవి వాల్మీకి ప్రణీతమైన స్తోత్రరాజం

ప్రాశస్త్యం - వ్యాఖ్య

డా॥ ఇలపావులూరి పాండురంగారావు

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**ADITYAHRIDAYAM**
Commentary and Stotra (Telugu)
By
Dr. I. Panduranga Rao

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No.289

**First Edition : 1985**
**Re-prints : 1998, 2003, 2005**

Copies : 5000

*Published by*
Sri Ajeya Kallam, I.A.S.,
Executive Officer,
T.T. Devasthanams, Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.

# ముందుమాట

భారతీయ వాఙ్మయంలో రామాయణ భారత భాగవతాలు మూడు అమూల్య గ్రంథరత్నాలు. ఐహికసుఖాల నందుకొని పారలౌకిక సౌఖ్యం పొందటానికి వీలుగా ఈ మూడింటినుంచి ఒక్కొక్క భాగాన్ని ఏరి నిత్య పారాయణకు అనువుగా పెద్దలు ఏర్పరిచారు. భాగవతంలో గజేంద్రమోక్షం నిత్యపారాయణ యోగ్యం. భారతంలో విష్ణుసహస్రనామం, భగవద్గీతలు పారాయణవిధిలో ఉన్న ప్రముఖ ఘట్టాలు. ఐహికవాంఛ వున్నవారు విష్ణుసహస్రనామాన్ని, మోక్షకాములు భగవద్గీతను పఠిస్తారని మనము ఎరిగినదే.

ఇక రామాయణంలో సుందరకాండ, ఆదిత్యహృదయం నిత్య పారాయణయోగ్యంగా ఆచరణలో ఉన్నాయి. సుందరకాండలో సుభగసుంద రుడూ, శివాంశసంభూతుడూ అయిన హనుమంతుని తేజోబలపరాక్రమాలు వర్ణించబడ్డాయి. సుందరకాండ చదివితే రామాయణమంతా పఠించిన ఫలితం దక్కుతుంది. సుందరకాండ పారాయణం కష్టాల కడలినుండి సులభంగా గట్టెక్కిస్తుందని పెద్దలు చెబుతారు.

"ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" ఆరోగ్యం ఆకాంక్షించేవారు సూర్యో-పాసనచేసి లాభం పొందవచ్చునట! అన్నివిధాలయిన సుఖసంపద లిచ్చే వాడైనప్పటికీ ఆదిత్యుడు ఆరోగ్యాన్ని ప్రసాదించడంలో అసమానుడు. ఆరాధ్యస్వరూపుడు, సర్వదేవాత్మకుడు, ప్రత్యక్షదైవం ...... కనుకనే సూర్యా-రాధనవల్ల సర్వదేవతాఫలం సిద్ధిస్తుందని అంటారు.

ఈ పుస్తకంలో డాక్టరు ఇలపావులూరి పాండురంగారావు గారు "ఆదిత్య హృదయం" ప్రశస్తిని చక్కగా వివరించారు. స్తోత్రానికి ప్రోద్బలకంగా శ్రుతులు, ఉపనిషత్తులు -- వీటినుంచి చాలా ఉదాహరణలు

మాపారు. ఈ రచనవల్ల ఈ స్తోత్రం ఆవశ్యకత పాఠకులకు చక్కగా బోధపడుతుంది. ఈ స్తోత్రరాజం ఆస్తికులకు ఎంతో ఉపయోగపడుతుం దనటంలో సందేహం లేదు. అనతికాలంలోనే ప్రతులన్నీ అయిపోవడంచేత పునర్ముద్రిస్తున్నాం. పాఠకులు ఎప్పటిలాగానే సమాదరిస్తారని ఆశిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# ఆదిత్యహృదయ ప్రాశస్త్యం

ప్రపంచములో ప్రాణికోటికి ప్రాణశక్తిని ప్రసాదించే ప్రభాకరుడు ప్రత్యక్ష దైవం. ఇతర దేవతలు భావనాగమ్యులు. వారు భావనాశక్తితో ధ్యానించి ఆరాధించవలసినవారు. కనుక సామాన్యులకు సాధ్యం కారు. కాని ప్రత్యక్షంగా కనిపించే ప్రభాకరుని ప్రతివ్యక్తీ ఆరాధించవచ్చు. సకల దేవతల తేజస్సును, ఓజస్సును, శక్తిని, సామర్థ్యాన్ని, అంశనూ, అనుగ్ర-హాన్ని తనలో మిళితం చేసుకొని, తనను ఆరాధించేవారిని తగిన రీతిలో తరింపచేసే ఆదిత్యుని హృదయాన్ని వివరించే స్తోత్రరాజం -- ఈ ఆదిత్య హృదయం. ఆదిత్యుడంటే సూర్యుడు. కాని సూర్యునికి సవిత, రవి, అర్కుడు, భాస్కరుడు, భానుడు, దినమణి, దివాకరుడు - అని ఎన్నో పేర్లు ఉన్నాయి. ఈ పేర్లన్నీ సూర్యుని గుణగణాలను, శక్తి సామర్థ్యాలను వివరిస్తాయి. ఒక్కొక్క పేరులో ఒకానొక విశిష్టగుణం భాసిస్తుంది. వీటిలో ఆదిత్యనామం ఈ స్తోత్రకర్త అయిన వాల్మీకికి బాగా నచ్చింది. అందువల్లనే దీనికి 'ఆదిత్యహృదయం' అనే పేరు వచ్చింది.

ఆదిత్యులు పన్నెండు మంది. వీరిలో విష్ణువుకూడా ఒకడు. 'ఆదిత్యానా మహం విష్ణుః' - అన్న గీతావాక్యం ఈ సత్యాన్ని చెబుతుంది. ఆదిత్యులలో ప్రధానస్థానం వహించిన విష్ణువును ఉద్దేశించి చెప్పబడిన స్తోత్రమవటంచేత దీనికి ఆదిత్యహృదయ మనే పేరు సార్థకమయింది. దీనిని స్తోత్రమని చెప్పక హృదయమని చెప్పడంలో విశేషముంది. నిజానికి మనకు కావలసిన కాంతిని, శాంతిని, నిలకడను, సరసతను, హాయిని, స్థాయిని ప్రసాదించే సౌహార్దం, సామర్థ్యం ఆదిత్యహృదయంలో ఉన్నాయి.

సామాన్యంగా ఆదిత్య శబ్దానికి అదితికి పుత్త్రుడు - అనే అర్థం చెప్పుకుంటారు. దితి సంతతిని దైత్యులని, అదితి సంతతిని అదీనులైన దేవతలని భావించటం పరిపాటి. దితి శబ్దానికి దైన్యమనే అర్థంకూడా ఉంది. దైన్యరాహిత్యంవల్ల ఆవిర్భవించే తేజోమూర్తి ఆదిత్యుడు. సర్వకాల సర్వావస్థల యందు నిర్వికల్పంగా నిశ్శిథిలంగా గగనవీథిని సంచరించే ప్రభాపుంజం ఆదిత్యహృదయం. ఆదిత్యుని హృదయాన్ని అవగాహనం చేసుకోగలిగితే అనంతమైన జ్ఞానాన్ని సొంతం చేసుకొన్నట్లే. కనుకనే "వేదాహమేతం పురుషం మహాంతం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అని శ్రుతివిశారదులు పారవశ్యంతో పొంగిపోయారు. సూర్యమండల మధ్యస్థమైన మహాత్రిపురసుందరిని మనసా దర్శించిన పరమేశ్వరీ పరాయణులు కూడా ప్రభాకరుని ప్రాభవాన్నే ప్రకటించారు. ఆకాశంలో నిర్విరామంగా వేవెలుగులతో వెలుగుతున్న ఆదిత్యునే మూడు సంధ్యలలో జ్యోతిర్విదులు ఆరాధిస్తారు. వేదమాతయైన గాయత్రీమంత్రంలో సవితృదేవతయొక్క వరేణ్యావైభవమే వివరింపబడినది. దివ్యనామసహస్రమైన శ్రీవిష్ణుసహస్రనామంలో ఈ ఆదిత్యుడు జ్యోతిరాదిత్యుడై భాసిస్తాడు. ఇంతటి అమోఘమైన సూర్యతేజస్సును 31 శ్లోకాలలో పుణ్యశ్లోకుడైన వాల్మీకి మనకు అందించటం మన అదృష్టం. ఇంత సులభసూత్రంగా వేదాంతశాస్త్రమంతా మనకు అందుబాటులో ఉన్నప్పటికీ, దాని జోలికి మనం వెళ్లకపోవటం మన దురదృష్టం.

వాల్మీకి రామాయణంలో ఆదిత్యహృదయం ఎలా ప్రవేశించింది? రామాయణ కథానాయకుడు రాముడు. సూర్యవంశంలో పుట్టినవాడు. పట్టపగలు మిట్టమధ్యాహ్నపువేళ రామ జననం జరిగింది. అకారణంగా కాలహోదితుడైన రావణుడు ఆయనతో వైరం పెట్టుకొన్నాడు. సామ దాన భేదాలు ఫలించలేదు. కోదండపాణి దండపాణియై రణరంగంలోకి దూకాడు. రావణుడు నిశాచరుడు. చీకటిలా ప్రపంచాన్ని ఆవరించి, చిన్మయానందంలో ఓలలాడవలసిన ప్రాణికోటిని నిర్దాక్షిణ్యంగా పీడించి వేధిస్తాడు. తనకేగాక తన తోటి మానవకోటికి కూడా కంటకంగా ఉన్న రావణుని సంహరించేందుకు

రాముడు సర్వప్రహరణాయుధాలతో సమరం సాగించాడు. అమోఘమైన తపశ్శక్తితో పరమేశ్వరుని అనుగ్రహం పొందిన రావణుణ్ణి సంహరించటం అంత సులభంగా కన్పించలేదు. రణరంగంలో అలసిపోయినా రావ-ణుడు ధైర్యంతో ఎదుర్కొంటున్నాడు. అతనిని ఎలా సంహరించటం అని రాముడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అప్రతిమానమైన రామ రావణయుద్ధం చూచేందుకు అంతరిక్షంలో దేవతలు, మహర్షులు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు అందరు విచ్చేశారు. వారిలో అగస్త్యమహర్షి కూడా ఉన్నాడు. ఆలోచనలో మునిగి ఉన్న రామచంద్రుని ముఖారవిందం చూచి అగస్త్యుడు క్రిందికి దిగివచ్చాడు. ఏకాంతంగా రామునిచెంతకు చేరి కులదేవత, పర దేవతయైన సూర్యభగవానుని ఆరాధించమని ఆదిత్యహృదయం అందిస్తాడు. రాముడు అందుకుంటాడు, ఆనందిస్తాడు, ఆరాధిస్తాడు. మరుక్షణంలోనే రామ రావణ యుద్ధం ముగిసిపోతుంది. ఇది వాల్మీకి రామాయణంలో యుద్ధకాండలో 107వ సర్గలో జరిగిన వృత్తాంతం. ఈ సర్గలో మొత్తం 31 శ్లోకాలు ఉన్నాయి. దీన్నే ఆదిత్యహృదయం అంటారు.

రామ రావణయుద్ధంలో రామ విజయం రావణ పరాజయం, చీకటి వెలుగుల పోరాటంలో వెలుగు గెలుపును చాటి చెపుతుంది. ఐహి కంతర తిమిరాన్ని ఛేదించి చిరంతన చైతన్యంలోని నిత్య సత్యసందీప్తిని సాక్షాత్కరించుకొనేందుకు ఈ ఆదిత్యహృదయం ఆనాడు రామచంద్రునికి రణరంగంలో ఎలా సహకరించిందో, ఈనాడూ ప్రాణికోటికి ఆంతరంగిక జీవితరంగంలో అలాగే ఉపకరిస్తుంది. కృష్ణార్జునుల నిమిత్తంగా గీతా-మృతం ప్రవహించినట్లే అగస్త్య రామచంద్రులను ఆలంబనం చేసికొని ఆదిత్యహృదయం ఆవిర్భవించింది. భారతంలో భగవద్గీత, రామాయణంలో ఆదిత్యహృదయం - ఈ రెండూ రణరంగంలోనే వెలువడడం గమనించదగ్గ విషయం. ప్రపంచశాంతికి, ఆత్మతుష్టికి - మూలకందములైన భయభక్తులు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయేమో అని అనిపిస్తుంది.

వాల్మీకి రామాయణంలో ఇలాంటి స్తోత్రాలు ఎక్కువగా కనిపించవు. అసలు వాల్మీకి రామాయణమంతా ఒక మహాస్తోత్రం. మంత్రరాజం.

ఒక్కొక్క అక్షరం మహాపాతకాలను నశింపచేసే మహత్తరమైన మంత్రం. అలాంటి మంత్రశక్తితో గాయత్రీ బీజ సమ్మితంగా రచించిన రామాయణంలో చోటుచేసుకొన్న ఈ స్తోత్రం, ఎంత ప్రశస్తమైనదో ఊహించవలసిందే కాని, మామూలు మాటలలో వివరించటం సాధ్యం కాదు.

ఆదిత్యహృదయంలోని 31 శ్లోకాలలో సర్గసమాప్తిని సూచించే చివరి శ్లోకాన్ని శాంతిపాఠంగా భావిస్తే 30 శ్లోకాలు మిగులుతాయి. ఇందులో మొదటి 9 శ్లోకాలు స్తోత్రానికి పూర్వరంగాన్ని సమకూర్చుతాయి. చివరి తొమ్మిది స్తోత్రప్రాశస్త్యం, ఫలశ్రుతి మొదలైన వాటితో ముగింపును సూచి- స్తాయి. ఇలా మొదటి తొమ్మిది, చివరి తొమ్మిది శ్లోకాలు మినహాయిస్తే మధ్య పన్నెండు శ్లోకాలు కేవలం స్తుతిభాగానికి చెందినవిగా కనిపిస్తాయి. ఈ పన్నెండు శ్లోకాలు ద్వాదశాదిత్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు కనిపి- స్తుంది. సరిగా ఈ స్తుతికి మధ్యభాగంలో "ద్వాదశాత్మ న్నమోఽస్తుతే" అనే నమోవాకంకూడా వినవస్తుంది. ఒకవిధంగా చూస్తే, ఈ నమోవాకం ఈ సూర్యానువాకానికి సంధిస్థలంగా గోచరిస్తుంది. పూర్వభాగంలో భాస్కరుని ప్రభావ వైభవాలను ప్రకటించే దివ్యనామ సంకీర్తనం వినిపిస్తుంది. ఉత్తర భాగంలో నమోవాక పురస్సరంగా ఆరాధ్యదేవతకు అంజలి అర్పించటం కనిపిస్తుంది. కాబట్టి మొదటి ఆరు శ్లోకాలు స్తుతికి చెందినవనీ, తరువాతి ఆరుశ్లోకాలు నుతికి చెందినవనీ భావించినా తప్పులేదు. రుద్రప్రశ్నలోని నమక చమకాలవలె, ఆదిత్యహృదయంలో ఈ రెండు భాగాలు అందులోని శబ్దాలకు శ్రుతిగౌరవాన్ని సంక్రమింప చేస్తాయి.

ఈ విధంగా ఆదిత్యహృదయంలోని మంత్రభాగం సర్గమధ్యలో స్తోత్ర హృదయంలో సంపుటీకరించబడింది. ప్రతి స్తోత్రానికి అనుషంగికంగా ఉండే అంగన్యాస కరన్యాసాలు కూడా ఈ మంత్రభాగానికి ముందుగా ఉన్న శ్లోకాలకు చేర్చబడ్డాయి. కాబట్టి ఈ స్తోత్రం సర్వసమగ్రమైనది. స్తోత్రం పఠించేటప్పుడు, సామాన్య ధరాతలంనుండి మనస్సు క్రమంగా ఊర్ధ్వవస్థ్వవ శ్లోకాలకు పయనించి, మహత్తరమైన సత్యాన్ని సాక్షాత్కరించుకొని, మరల పుడమికి తిరిగి వచ్చినట్టుగా అనిపిస్తుంది.

ఈ స్తోత్రం 'తతో యుద్ధ పరిశ్రాంతం' అనే చరణంతో ఆరంభ మవుతుంది. ఇందులో మొదటి పదం, సుందరకాండలోని మొదటి పదం ఒకటి కావటం గమనించదగ్గ విషయం. తదీయమైన ఈ పదాన్నే అన్వేషిస్తూ వెళతాడు సీతాతత్త్వార్థకోవిదుడు హనుమంతుడు. 'తత్త్వమసి', 'యత్తత్పద మనుత్తమం', చితి స్తత్పద లక్ష్యార్థా' మొదలైన సూక్తులతో కీర్తించబడిన తత్త్వార్థమే ఈ 'తతః' అనే శబ్దంలో స్ఫురిస్తుంది.

ఆదిత్యహృదయంలోని మొదటి రెండుశ్లోకాలు స్తోత్రసందర్భాన్ని వివరిస్తాయి. అగస్త్యుడు రాముని సమీపించటం ఈ రెండు శ్లోకాలకు తాత్పర్యం. మూడవ శ్లోకం అగస్త్యుని సంబోధనతో ఆరంభమవుతుంది. "రామ రామ మహాబాహో" అని అగస్త్యుడు ఆజానుబాహువైన శ్రీరామ చంద్రుని సంబోధిస్తాడు. రణరంగంలో రావణసంహారంకోసం తన పరాక్రమాన్ని సద్వినియోగం చేస్తున్న రాముణ్ణి మహాబాహువని సంబోధించటంలో ఎంతో ఔచిత్యం ఉంది. అంతకు మించిన ఔన్నత్యం 'రామ రామ' అని రెండుమార్లు రామ శబ్దాన్ని ఉచ్చరించడంలో ధ్వన్యాత్మకంగా దాగి ఉన్నది. బాల్యంలోనే రాఘవరాముడు, భార్గవరాముణ్ణి నిర్జించి అతని తేజస్సును తనలో లయింప చేసుకున్నాడు. కాబట్టి 'భార్గవరాముని పరాక్రమం, దశరథరాముని దాక్షిణ్యం - రెండూ నీలో మేళవించి ఉన్నాయి సుమా!' అని అగస్త్యుడు హెచ్చరిస్తున్నాడు. 'నీవు కౌసల్యా దశరథులు కన్న మామూలు రామయ్యవు కావు. చతుర్బాహువైన శ్రీమహావిష్ణువు తేజస్సు నీలో మూర్తీభవించి ఉన్న'దనికూడా అగస్త్యుడు సూచిస్తున్నాడు. మహాబాహువనే సంబోధనలో బాహువుల సంఖ్య సూచింపబడలేదు. వాటి మహత్తు మాత్రమే చెప్పబడింది. ఎదుట నిలబడి ఉన్న శత్రువు దశకంధరుడు. అతనికి ఇరవై బాహువు లున్నాయి. అన్ని బాహువులున్నా రామచంద్రుని రెండు బాహువులలో ఉన్న మహత్త్వం అతనిలో లేదు. భూర్భువస్సువర్లోకాలను మించినది మహర్లోకం. ఆదిత్యుడు దానికి అధిపతి. "మహ ఇతి బ్రహ్మ" అన్న తైత్తిరీయ సూక్తినిబట్టి పరబ్రహ్మయొక్క బాహు పరాక్రమం రామునిలో ఉన్నదని మహాబాహువనే ఈ సంబోధన తెలియపరుస్తుంది. "మహ ఇత్యాదిత్యః" అన్న శ్రుతివాక్యం, సూర్యశక్తి

రామబాహువులలో ఉన్నదనికూడా స్ఫురింపచేస్తుంది. ఈ సంబోధనతోనే ఆదిత్యహృదయంలోని మంత్రశక్తి ప్రారంభమవుతుంది. ధ్వన్యాత్మకమైన ఈ సంబోధనకు తరువాత, పరమరహస్యం, పరమ పురాతనమైన పరమార్థాన్ని నీకు అందజేస్తున్నానని అగస్త్యుడు అంటాడు. ఈ పరమరహస్యం ఈ సంబోధనలోనే ఉన్నది.

నాలుగవ శ్లోకంనుండి స్తోత్రప్రాశస్త్యం ఆరంభ మవుతుంది. ఆదిత్య హృదయం పరమపావనమైన స్తోత్రమట. అంతఃశత్రువులను నశింప చేయు గలిగిన శక్తి ఈ స్తోత్రంలో ఉన్నదట. దీనిని నిత్యం జపించిన వారికి జయము చేకూరుతుందట. శుభం కలుగుతుందట. లభించిన జయం, కూడిన శుభం కలకాలం నిలబడుతాయట. మంగళకరమైన వస్తువుల కన్నింటికీ మాంగళ్యాన్ని ప్రసాదించగలిగే ఈ మహామంత్రం సకల పాపా లను, చింతలను, చీకులను, శోకాన్ని ఉపశమింప చేస్తుందట. ఆయుస్సు పెంచుతుందట. ఇంతకు మించిన స్తోత్రం లేదట.

అరుణోదయ కిరణకాంతితో చతుర్దశ భువనాలను లాలించి పాలించే భాస్కరుణ్ణి దేవతలు, గంధర్వులు, రాక్షసులు అందరూ ఏదో విధంగా ఆరా ధిస్తారు. సూర్యుడు ఉదయించగానే అర్ఘ్యపాద్యాదులతో అంజలి ఘటిస్తూ, దేవతలందరు ప్రత్యక్షదైవమైన ప్రభాకరునికి నమస్కరిస్తారు. ఈ ప్రాశస్త్యం తెలియని రాక్షసులు, తత్తుల్యులు నిద్రాముద్రలోనే సవితకు సాష్టాంగ నమస్కారం చేస్తారు. సూర్యుడు సర్వతోముఖుడు కాబట్టి ఏ దిక్కునుండి నమస్కారం చేసినా ఆ మొక్కు ఆయనకే చెందుతుంది. ఇలాంటి సూర్య దేవతను పూజించవలసిందని అగస్త్యుడు రామచంద్రునికి ఉపదేశిస్తాడు. ఈ ఉపదేశ వాక్యం ఆరవ శ్లోకంలో ఆరు భాగాలుగా వినవస్తుంది. 'పూజయస్వ' (పూజించుము) అనే ఆదేశపదానికి 'రశ్మిమంతం, సముద్యంతం, దేవా-సుర నమస్కృతం, వివస్వంతం, భాస్కరం, భువనేశ్వరం' -- అనే ఆరు పదాలు అంగన్యాస కరన్యాసాలతో షణ్ముఖసంపదను సూచిస్తాయి. ఆదిత్యహృదయ మనే మంత్రానికి ఇది న్యాసభాగం.

భాస్కరుని ఉపాసించవలసిందని ఉపదేశించిన తరువాత సకల దేవతలు ఈ భాస్కరునిలోనే మూర్తీభవించి ఉన్నారని అగస్త్యుడు వివరిస్తాడు. కిరణకరణములతో తేజోమూర్తిగా భాసించే భాస్కరుడు సర్వదేవతా స్వరూపుడు. దేవతలను రాక్షసులను సమభావంతో పోషించే సాత్త్వికమైన స్వభావం సూర్యకిరణములలో స్వతస్సిద్ధంగా ఉంది. మంచివారికీ, చెడ్డవారికీ, ఉన్న వారికీ, లేనివారికీ, రాజభవనాలకూ, పూరిగుడిసెలకూ సూర్యకాంతి సమానంగా లభిస్తుంది. ఒకవిధంగా చూస్తే కోటలలోకంటె కుటీరాలలోనికే సూర్యకిరణాలు ఎక్కువ సూటిగా ప్రసరిస్తాయి. తన కిరణజాలంతో లోకబాంధవుడు సమస్తలోకాలను సృష్టిస్తాడు, పోషిస్తాడు, లయింపచేస్తాడు. కనుకనే బ్రహ్మ, విష్ణువు, శివుడు ముగ్గురు సూర్యకాంతిలోనే ఉన్నారు. అంతే కాదు. శివకుమారుడు స్కందుడుకూడా ఇతడేనట! దివినుండి భువికి దిగివచ్చిన దేవతను స్కందుడని భావించటంలో పొరపాటులేదు. సూర్యుని సర్వదేవాత్మకత్వం అంతటితో ఆగలేదు. ఇంద్రుడు, కుబేరుడు, యముడు, సోముడు, వరుణుడు, పితృదేవతలు, ఎనిమిదిమంది వసువులు, ఇద్దరు అశ్వినీదేవతలు, మరుద్గణాలు, సాధ్యులు -- అందరూ భాస్కరునికి ప్రతిరూపాలుగా గోచరిస్తారు. వాన కురిపించేవాడు ఇంద్రుడు. కాని, సూర్యుని సహకారము లేనిదే ఇంద్రు డా పనిచేయలేడు. అలాగే సకలసంపదలను ప్రసాదించే కుబేరుడు, ఆధి వ్యాధులను పోగొట్టే అశ్వినీకుమారులు, ప్రాణములను పోసే ప్రజాపతి, ఆ ప్రాణములను హరించే యముడు, వసుంధరను సస్యశ్యామలం చేసే చంద్రుడు, వసువులు, ఆలోచన లిచ్చే మనువు, గాలి, నిప్పు, ఊపిరి, ఋతువులు, పగలు, రాత్రి, వెలుగు వీటన్నిటికీ మూలాధారం సూర్యుడు. సూర్యరశ్మియొక్క సహకారంతోనే ఈ పనులన్నీ యథావిధిగా జరుగుతూ ఉన్నాయి.

ఆదిదేవుడైన సూర్యునికి ఆదిత్యనామం సర్వథా సార్థకమైనది. సర్వస్వం ప్రసవింపచేసేవాడు కాబట్టి అతనికి సవిత అనే పేరు వచ్చింది. ఎవ్వరు చొరరాని చోటులోకూడా సూర్యకిరణాలు చొచ్చుకొనిపోతాయి. కాబట్టి సూర్య నామం అన్వర్థమైనది. ఆకాశంలో పయనిస్తూ ఉంటాడు కాబట్టి ఖగనామధేయం అతనికి చెల్లింది. విశాలమైన రెక్కలతో విను వీథిలో

సంచరించే గరుత్మంతునికి కూడా ఖగరాజనే పేరుంది. గరుత్మంతునిలా సూర్యుడుకూడా ఆకాశమార్గంలో సంచరిస్తూ అఖిల ప్రపంచానికి అమృతం పంచిపెడతాడు. ప్రాణికోటిని పోషించేవాడు కాబట్టి, పూషనామం వచ్చింది. కిరణాలతో శోభిల్లుతూ ఉంటాడు కాబట్టి, గభస్తిమంతుడని అనిపించు కున్నాడు. పసిడి వన్నెతో మిసమిసలాడుతూ, వెలుగుతూ, వెలిగిస్తూ పగటి వెలుగును వెలయిస్తూ ఉంటాడు కాబట్టి స్వర్ణరేతస్కుడని అనిపించు కున్నాడు.

ఆకుపచ్చని గుర్రాలపై వేవెలుగులసామి రాజఠీవితో విహరిస్తాడట. ఆయన గుర్రాలకు 'సప్తి' అని పేరు. సప్తి నామధేయం గల ఏడు గుర్రాలపై పయనిస్తాడు కాబట్టి 'సప్తసప్తి' అనే పేరు ఆయనకు వచ్చింది. సూర్యకాంతిలో ఏడు వన్నెలు ఇమిడిఉన్నాయి. భూర్భువస్సువరాది సప్తలోకాలలో సూర్యకాంతి ప్రసరిస్తుంది. సప్తమినాడు సూర్యకాంతి సర్వలోకపర్వంగా ప్రజ్వలిస్తుంది. అందువల్లనే రథసప్తమి సూర్య పర్వంగా రూపొందింది. సూర్యకిరణాలకు మరీచులని పేరు. ఎండమావులను కూడా మరీచిక లంటారు. సూర్యకిరణాలు శూన్యంనుండి వెలువడి సకల భువనాలల్లో ప్రసరించే శక్తిచైతన్యం లాంటివి. కనుకనే శివశక్తి సామ-రస్యాన్ని సూర్యమండల మధ్యవర్తిగా భావించటం భావనాపరులకు అభీష్టం. సూర్యుని పేరు చెబితేనే చీకటి ఛిన్నాభిన్నమై చెదరిపోతుంది. చీకటిని చిలికి, దానిలోనుంచి శివతత్త్వాన్ని నవనీతంగా వెలికి తీయగలిగిన దిట్ట కాబట్టి, సూర్యుణ్ణి మహర్షులు శంభువుగా కూడా భావించారు. ఆయన త్వష్ట అట. త్వష్ట అంటే వడ్రంగి అని అర్థం. వడ్రంగి అడవిలో దొరకిన కొయ్యను తీసికొని, తన కల్పనకు అనుగుణంగా దానిని కోసి మలిచి, ఒకానొక రమణీయమైన ఆకృతిని సృష్టిస్తాడు. అలాగే సూర్యుడు కూడా ప్రాణులకు కావలసిన ప్రాణశక్తిని తగు మోతాదులో తగినరీతిలో ప్రసాదించి వారికి పరిమిత లావణ్యాన్ని, అవయవ సౌష్ఠవాన్ని చేకూరుస్తాడు. అంతే కాదు. దేశకాలాలను కూడా ఇలానే నియమితం చేసి రేయింబవళ్లను, తిథులను, నక్షత్రాలను, మాసాలను, ఋతువులను, అయనాలను, సంవత్స రాలను కల్పిస్తాడు. కనుక సూర్యుడు నిజమైన త్వష్ట. కాని ఈ త్వష్టయొక్క

ఆశయం వికసింపచేయటమే కాని, నశింపచేయటంకాదు. వినాశంలోకూడా వికాసాన్ని బీజరూపంలో ఇముడ్చగల శక్తి అతని చైతన్య కిరణరాశిలో ఉన్నది.

అతడు హిరణ్యగర్భుడు. "హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతి రేక ఆసీత్" అని శ్రుతి కీర్తించిన హిరణ్యగర్భుడు సూర్యుడే. సృష్టికి ఆది, ఆధారం ఈ హిరణ్యమే. ఈ హిరణ్యం సూర్యుని గర్భంలో పుష్కలంగా ఉంది. ఎంత కాళరాత్రి గడచినా సూర్యు డుదయించటంతో ఆశలు చిగురిస్తాయి. పసిడికాంతితో ప్రకృతి పరిఢవిల్లుతుంది. శిశిరంలో ఉన్న చల్లదనం, మెత్తదనం, నైరాశ్యం, నిర్వేదం సూర్యునివల్లనే లభిస్తాయి. ఆ సూర్యుడే మందువేసవిలో తపనుడై భూమిని తపింపచేస్తాడు. ఒకప్పుడు కాంతి నిచ్చే భాస్కరుడు, మరొకప్పుడు చైతన్యాన్ని ప్రసాదించి, అంత స్తేజస్సును వెలయించే రవి అవుతాడు. అతని కడుపులో పసిడి ఉన్నట్లే అగ్నికూడా ఉంది. అదితి కన్న అల్లారుబిడ్డ కాబట్టి, అతడు ఎక్కడకు వెళ్లితే అక్కడి వాయుమండల మంతా పవిత్ర మవుతుంది. "శంఖ" శబ్దంలో 'శం' మంచిని సూచిస్తుంది. 'ఖ' శబ్దం ఆకాశవాచ్యం. సూర్యగమనం ఆకాశానికి పావనత్వాన్ని ప్రసాదిస్తుంది. అతడున్నచోట మంచు నిలవదు. మంచును హరించి, మంచిని పెంచే మహనీయుడు సూర్యుడు.

ఆకాశానికి అధిపతి అవడంవల్ల అతనికి వ్యోమనాథుడనే పేరు వచ్చింది. చీకటిని చీల్చుకొని వేదత్రయనాదాన్ని లోకత్రయికి వినిపిస్తూ, మేఘాలను మెరిపిస్తూ, వర్షాలను కురిపిస్తూ, నీళ్లతో నెయ్యం జరిపిస్తూ, వింధ్యాచలం మీద గంతులువేస్తూ, విహరిస్తూ ఉంటాడు -- వేయివన్నెల వేల్పు సూర్యదేవుడు.

కోపంవస్తే కాలాగ్నిలా మండిపడతాడు. సూర్యమండలం అతనికి జన్మకుండలి. ఆ మండలికి అతడే ప్రభువు. పింగళవర్ణంలో ప్రజలకు ప్రాణాలుపోసే సూరన్న, అవసరమని తోచినప్పుడు వాళ్లను తపింపచేస్తాడు. లేనిదాన్ని సృష్టించగల శక్తిగలవాడు కనుక, అతనికి కవినామం సార్థకమైనది. విశ్వరూపుడైన అతని దివ్యతేజస్సుతో రంజిల్లని అంశ ముండదు. అన్ని భావాలకు, భవనాలకు, భువనాలకు, ఉద్భవాలకు అతడే మూలం.

ఆకాశంలో కనిపించే చుక్కలు, గ్రహాలు, నక్షత్రాలు, అన్నీ అద్భుత చెప్పేచేతలకు లొంగి నడుచుకుంటూ ఉంటాయి. గ్రహాలు, నక్షత్రాలు ఒకే కాంతివలయంలో కొన్ని నియమాలకు కట్టుబడి ఉండడం సూర్య శాసనానికి నిదర్శనం. అశ్విని, భరణి మొదలైన ఇరవై ఏడు నక్షత్రాలు. మిగిలినవి చుక్కలు. కదలిక గలవి గ్రహాలు, కదలకుండా ఉన్నట్టు కనిపించేవి చుక్కలు, నక్షత్రాలు. ఇవన్నీ సూర్యమండలంలోని భాగాలే. మన సూర్యుడి లాంటి సూర్యు లనేకులు బ్రహ్మాండంలో ఉన్నారు. ఆ సూర్యులందరికీ ఆదిసూర్యుడు ఆదిత్యుడు. అలాంటి ఆదిత్యులు పన్నెండు మంది. వారిలో విష్ణువు ప్రధానుడు. ఈ ద్వాదశాదిత్యులలో వెలిగే ద్వాదశాత్మ అందరికీ నమస్యుడు, వంద్యుడు, ఆరాధ్యుడు.

ఈ ద్వాదశాత్మ సంస్మరణంతో ఆదిత్యహృదయంలోని పూర్వార్థం -- అంటే స్తుతిభాగం ముగుస్తుంది. ఆ తర్వాత ఉత్తరార్థంలో-నుతిభాగం నమకం ఆరంభ మవుతుంది. సూర్యు డుదయించే తూర్పుదిక్కు, అస్త మించే పడమరదిక్కు -- ఈ రెంటికీ నమస్కారం. ప్రపంచంలో కనిపించే వెలుగుకు, పగటికి అధిపతి అయిన కాంతిదేవునికి నమస్కారం.

జయస్వామికి నమస్కారం. మంగళకరమైన జయాన్ని ప్రసాదించే జయభద్రునికి నమస్కారం. పచ్చని గుర్రాలతో పయనించే వేవెలుగుల ఆదిత్యునికి మరి మరి నమస్కారం.

ఉగ్రమూర్తికి నమస్కారం. శూరధీరునికి నమస్కారం. విలక్షణమైన వాక్కును వెలయించే వీరునికి నమస్కారం. సంసారసారాన్ని అవగాహనం చేసుకొని, తాను తరించి, ఇతరులను తరింపచేసే తరణికి నమస్కారం. రేయిచివరిజామున చల్లనిగాలికి హాయిగా నిదురపోతున్న కమలాలకు కిరణా లతో గిలిగింతలు పెట్టి, మేల్కొల్పే చిలిపిచేతల చిన్మయమూర్తికి నమస్కారం. మృత్యువును స్వాధీనపరచుకొన్న మార్తాండునకు నమస్కారం.

బ్రహ్మను, ఈశానుని, అచ్యుతుని -- ముగ్గురినీ స్వాధీనం చేసుకొన్న సూరవార్యునికి నమస్కారం. ఎంతప్రసరించినా తరుగని అక్షయకాంతితో

శోభిల్లే జ్యోతిరాదిత్యునికి నమస్కారం. భక్ష్యం, అభక్ష్యం అనే భేదం లేకుండా సర్వం హరించి, సర్వం తపింపచేసే రుద్రమూర్తికి నమస్కారం.

చీకటిని హరించి, మంచును పటాపంచలు చేసి, శత్రువులను సంహరించే సూర్యుడు మహితాత్ముడు, అమితాత్ముడు. అతని శక్తి అమోఘం. తలచుకుంటే అతడు కృతఘ్నులను కూడా సంహరించగలడు. ఆయాచితంగా, అవ్యాజ్యంగా అంతులేని కాంతిని మనకు ప్రసాదించేందుకు అతడు ఎక్కడినుండో మన పంచల్లోకి దిగివస్తే, మనం మంచంమీదనుండి కూడా దిగేందుకు బద్ధకిస్తే మనం కృతఘ్నులం కాక మరేమవుతాం? కాబట్టి సూర్యదేవునికి ఏమాత్రం అపచారం చేయకూడదు. సూర్యోదయ మయ్యేసరికి లేచి ఆ ప్రాణసందేశాన్ని గ్రహించేందుకు సిద్ధంగా ఉండటమే, ఆయనకు మనం చేయదగిన ఉపచారం. అలా చేయకపోవటమే అపచారం. వెలుగుల వేల్పు విచ్చేసేసరికి మనం మెలకువలో ఉండటమే మన విధి. అలాంటి జ్యోతిర్మయునకు నమస్కారం.

కాచిన బంగారువన్నెతో కళకళలాడే అగ్నిదేవునికి నమస్కారం. సకల కార్య సమర్థుడైన విశ్వకర్మకు నమస్కారం. బహిరంతర తిమిరాన్ని ఛేదించి, కాంతిని ప్రసరింపచేసే లోకసాక్షికి నమస్కారం.

ఇంతటితో నమనం ముగుస్తుంది. మళ్ళీ సూర్యమహిమ ఆరంభ మవుతుంది. ప్రాణులను నశింపచేసి మళ్ళీ సృష్టించగల శక్తి ప్రభాకరునిలో ఉంది. అతడు రక్షిస్తాడు, శిక్షిస్తాడు, వేడివేడి కిరణాలతో మాడ్చివేస్తాడు. వల్లవర్షం కురిపిస్తాడు.

మనం నిద్రపోయినా మనలో అతడు మేల్కొని ఉంటాడు. 'అగ్నే త్వం సుజాగృహి, వయం సుమం దిశీమహి' అని శ్రుతిగీతంలో చెప్పినట్లు సర్వకాల సర్వావస్థలయందు మనకు తోడునీడగా మనలో వెలుగుతూ ఉన్న ఆదిత్యరూపం సర్వదా ఆరాధ్యం. మనం చదివే వేదాలు, చేసే క్రతువులు, యజ్ఞయాగాదులు, వాటి ఫలితాలు, సకలకార్య కలాపాలు -- అన్నిటికీ సాక్షి భూతుడై అంతరాత్మలా అతడు మనవెంటనే ఉంటాడు. మన వాక్కే

ఋగ్వేదం. మనం చేసే పనులే యజుర్వేదం. మన మనస్సులోని సామ్యమే సామవేదం. ఈ మూడింటిని నడిపించే వాడు ప్రాణస్వరూపుడు సూర్యుడు. అలాంటి సూర్యుణ్ణి స్మరిస్తే చాలు, భయంకరమైన ఆపదలుకూడా నశిస్తాయి. అడవికూడా ఆనందనిలయంగా మారుతుంది.

కాబట్టి ఆ దేవదేవుని, జగదీశ్వరుని ఏకాగ్రంగా ఆరాధించు. ఈ స్తోత్రం మూడుసార్లు పఠిస్తే యుద్ధంలో నీకు విజయం లభిస్తుంది. ఈ క్షణంలోనే నీ చేతుల్లో రావణసంహారం జరుగుతుంది -- అని అగస్త్యుడు రామునికి బోధిస్తాడు. తొలిపలుకుల్లో చేసిన "మహాబాహో" అనే సంబోధన ఈ మలిపలుకుల్లో కూడా (అస్మిన్ క్షణే మహాబాహో రావణం త్వం వధిష్యసి) రావటం గమనించదగ్గ విషయం. ఈ బోధనతో ఆదిత్యహృదయం లోని మంత్రభాగం ముగిసి, ఫలశ్రుతి ప్రారంభమవుతుంది.

ఈ మాటలు చెప్పి అగస్త్యుడు తాను వచ్చిన దారిని తిరిగి వెళ్లాడట. ఆ మాటలు విన్న రాముడు వినయంతో, ఆనందంతో, నిష్ఠతో ఆదిత్య హృదయం జపించాడట. కోదండం చేతబట్టుకొని, రాముడు రావణ సంహారం కోసం రణరంగంలో ప్రవేశిస్తాడు. ఆ సమయంలో అంతరిక్షం నుండి సూర్యుడు దిగివచ్చి 'త్వర' త్వరగా పని పూర్తిచేయవలసినదని సూచిస్తాడు. 'త్వర' అనే మాట సూర్యునినోట వెలువడటమే ఆలస్యం, లోకరావణుడైన రావణుడు పంచత్వాన్ని పొందుతాడు.

ఇదీ ఆదిత్యహృదయం. ఈ స్తోత్రం చదివేందుకు మూడు నాలుగు నిమిషాలకు పైన పట్టదు. సూర్యు డుదయించేందుకు ఎంతకాలం పడుతుందో, సరిగా అంతే సమయంలో ఈ స్తోత్రం చదవవచ్చు. అలా లెక్క ప్రకారం వాల్మీకి ఈ స్తోత్రం వ్రాశాడా అనిపిస్తుంది. ఈ స్తోత్రం ఎప్పుడైనా చదవవచ్చు. కాని ఉదయం, సాయంత్రం, మధ్యాహ్నం నిష్ఠగా నియమంతో చదవటం మిక్కిలి శ్రేయస్కరం. ఎక్కడ ఎప్పుడు చదివినా సూర్యబింబాన్ని మనస్సులో ధ్యానించి చదవటం మంచిది. సూర్యబింబానికి ఎదురుగా నిలబడి, ఉదయాస్తమయ సమయాల్లో చదవగలిగితే మరీ మంచిది. ఏ రూపంలో, ఏ కాలంలో, ఏ ఉద్దేశ్యంతో స్మరించినా ఆదిత్యనామ సంస్మరణ సకల పాపాలను పోగొట్టి త్రికరణ శుద్ధిని ప్రసాదిస్తుంది.

అర్థం తెలియకుండా చదివినా ఈ స్తోత్రం అనిర్వచనీయమైన ఆనందాన్ని ఇస్తుంది. తెలిసినా, తెలియకపోయినా ప్రకృతిశక్తుల ప్రభావం మనమీద కనిపించినట్లే, అక్షరరూపంలో ఆదికవి అందించిన యీ అమోఘ-మైన అస్త్రం అర్థనిరపేక్షంగానే సార్థకమవుతుంది. ఇక అర్థం తెలుసుకొని ఆరాధిస్తే అపరిమేయమైన ఆనందం లభిస్తుంది. ఇది అనుభవం వల్లనే బోధ పడుతుంది. కాబట్టి తర్క కుతర్కాలతో కాలయాపన చెయ్యక అమృతాయమాన అక్షరభారతిని ఆరాధించి తరించటం వివేకవంతుల విధి.

-*-

# ఆదిత్యహృదయం

## స్తోత్రం

# స్తోత్రం

హరిః ఓం

తతో యుద్ధపరిశ్రాంతం సమరే చింతయా స్థితమ్,
రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్. 1

దైవతై శ్చ సమాగమ్య ద్రష్టు మభ్యాగతో రణమ్,
ఉపాగమ్యాబ్రవీద్రామం అగస్త్యో భగవాన్ ఋషిః. 2

* * *

రామ! రామ! మహాబాహో! శృణు గుహ్యం సనాతనమ్,
యేన సర్వా నరీన్ వత్స! సమరే విజయిష్యసి. 3

ఆదిత్యహృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్,
జయావహం జపే న్నిత్యం అక్షయ్యం పరమం శివమ్. 4

సర్వమంగళ మాంగల్యం సర్వపాపప్రణాశనమ్,
చింతాశోక ప్రశమనం ఆయుర్వర్ధన ముత్తమమ్. 5

* * *

రశ్మిమంతం సముద్యంతం దేవాసుర నమస్కృతమ్,
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్. 6

సర్వ దేవాత్మకో హ్యేష తేజస్వీ రశ్మిభావనః,
ఏష దేవాసురగణాన్ లోకాన్ పాతి గభస్తిభిః. 7

ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః,
మహేంద్రో ధనదః కాలో యమః సోమో హ్యపాంపతిః. 8

పితరో వసవః సాధ్యా హ్యశ్వినౌ మరుతో మనుః,
వాయు ర్వహ్నిః ప్రజాఃప్రాణాః ఋతుకర్తా ప్రభాకరః. 9

ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్,
సువర్ణసదృశో భానుః స్వర్ణరేతా దివాకరః. 10

హరిదశ్వః సహస్రార్చిః సప్తసప్తి ర్మరీచిమాన్,
తిమిరోన్మథనః శంభు స్త్వష్టా మార్తాండకోఽంశుమాన్. 11

హిరణ్యగర్భః శిశిర స్తపనో భాస్కరో రవిః,
అగ్నిగర్భోఽదితేః పుత్రః శంఖః శిశిరనాశనః. 12

వ్యోమనాథ స్తమోభేదీ ఋగ్యజుస్సామ పారగః,
ఘనవృష్టి రపాంమిత్రో వింధ్యవీథీ ప్లవంగమః. 13

ఆతపీ మండలీ మృత్యుః పింగళః సర్వతాపనః,
క(ర)వి ర్విశ్వో మహాతేజా రక్తః సర్వభవోద్భవః. 14

నక్షత్ర గ్రహ తారాణా మధిపో విశ్వభావనః,
తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మన్! నమోఽస్తుతే. 15

* * *

నమః పూర్వాయ గిరయే పశ్చిమాయాద్రయే నమః,
జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః. 16

జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః,
నమో నమ స్సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః. 17

నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః,
నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమో నమః. 18

బ్రహ్మేశా నాచ్యుతేశాయ సూర్యా యాదిత్యవర్చసే,
భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః. 19

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే,
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః. 20

తప్తచామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే,
నమస్తమోఽభినిఘ్నాయ రవయే లోకసాక్షిణే. 21

* * *

నాశయత్యేష వై భూతం తదేవ సృజతి ప్రభుః,
పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః. 22

ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః,
ఏష ఏవాగ్నిహోత్రం చ ఫలం చై వాగ్నిహోత్రిణామ్. 23

వేదాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవ చ,
యాని కృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః. 24

ఏన మాపత్సు కృచ్ఛ్రేషు కాంతారేషు భయేషు చ,
కీర్తయన్ పురుషః కశ్చి న్నావసీదతి రాఘవ! 25

పూజయ స్వైన మేకాగ్రో దేవదేవం జగత్పతిమ్,
ఏతత్ త్రిగుణితం జప్త్వా యుద్ధేషు విజయిష్యసి. 26

అస్మిన్ క్షణే మహాబాహో! రావణం త్వం వధిష్యసి,
ఏవ ముక్త్వా తతోఽగస్త్యో జగామ చ యథాగతమ్. 27

ఏతచ్ఛ్రుత్వా మహాతేజా నష్టశోకోఽభవత్తదా,
ధారయామాస సుప్రీతో రాఘవః ప్రయతాత్మవాన్. 28

ఆదిత్యం ప్రేక్ష్యం జప్త్వేదం పరం హర్ష మవాప్తవాన్,
త్రిరాచమ్య శుచి ర్భూత్వా ధను రాదాయ వీర్యవాన్. 29

రావణం ప్రేక్ష్య హృష్టాత్మా జయార్థం సముపాగమత్,
సర్వయత్నేన మహతా వధే తస్య ధృతోఽభవత్. 30

అథ రవి రవద న్నిరీక్ష్య రామం
ముదితమనాః పరమం ప్రహృష్యమాణః,
నిశిచరపతి సంక్షయం విదిత్వా
సురగణ మధ్యగతో వచ స్త్వరేతి. 31

ఓం తత్ సత్.

* * *

T.T.D. Religious Publications Series No. 289

Price : Rs.5/-

Published by Ajeya Kallam, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.